
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025


ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.8
కనిష్ఠం 22.2



రేపు శంకర్‌పల్లికి సుందరాంగులు

ఎకో టూరిజం పార్కు సందర్శన

- అరుదైన మొక్కలను తిలకించనున్న అందగత్తెలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో ఈనెల 16న(శుక్రవారం) వివిధ దేశాల సుందరీమణులు సందడి చేయనున్నారు. ఆహ్లాదమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి రానున్నారు. ఎకో పార్కులో 85 దేశాల నుంచి సేకరించిన అంతర్జాతీయ వృక్షాలను వీక్షించనున్నారు. అరుదైన మొక్కలతో పాటు శిల్పకళా సంపదను తిలకించనున్నారు. 25వేల అరుదైన మొక్కలతో అలరిస్తున్న ఎక్స్‌పీరియంకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అందగత్తెలు రానున్నారు. రాత్రి 7 గంటల వరకు ఎకో పార్కులో గడపనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. సుందరీమణులు సందర్శించే ప్రదేశాల్లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి వేళలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఏకో పార్కులో కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాట్లు, ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.

'యూనిఫాంలను నాణ్యతగా కుట్టాలి'

చేవెళ్ల, మే14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే యూనిఫాంలను కుట్టడంతో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా మహిళా సమాఖ్య ప్రాజెక్టు మేనేజర్ స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం ఆమె ఊరేళ్ల, పామెన మహిళా శక్తి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏకరూప దుస్తుల కుట్టుకను పరిశీలించారు. చేవెళ్ల మండలంలోని 79 ప్రభుత్వ పాఠశాలల్లోని 4061 మంది విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులను అందించనున్నట్లు తెలిపారు. ఏపీఎం శోభారాణి, క్లస్టర్ కోఆర్డినేటర్ షబ్బీర్, సాగర్, నర్సింహులు, మాన్యమ్మ, శ్రీనివాస్, యాదయ్య, అరుణ, పుష్పలత పాల్గొన్నారు.

జిల్లాలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల వివరాలు

మండలం	రూ. (లక్షల్లో)
కందుకూరు	22.00
చేవెళ్ల	21.58
కొందుర్గు	13.80
కేశంపేట	19.31
మంచాల	16.83
తలకొండపల్లి	13.55
మొత్తం	107.07


చేవెళ్లలోని షెడ్డులో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ పనిముట్లు

అద్దె యంత్రం నిరుపయోగం!

- మూలన పడిన పరికరాలు
- పంక్చరై పాడవుతున్న ట్రాక్టర్లు
- తుప్పు పడుతున్న పనిముట్లు
- పట్టించుకోని డీఆర్‌డీఏ అధికారులు

చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయంలో సాయమవుతుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అద్దె యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మహిళా సంఘాల ద్వారా కర్షకులకు తక్కువ అద్దెకు వ్యవసాయ పరికరాలను ఇవ్వాలని నిర్ణయించింది. మొదట్లో ఈ పరికరాలను బాగానే ఉపయోగించుకున్నారు. ఆ తర్వాత నిర్వహణ కొరవడి యంత్రాలు మూలన పడ్డాయి. కొన్ని చోట్ల పరికరాలు తుప్పు పట్టాయి. రైతులు కూడా వీటిని వినియోగించుకోవడానికి ఆసక్తి చూపకపోవడంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లలో ప్రస్తుతం ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని సెంటర్లలో పనిముట్లు షెడ్డులకే పరిమితమయ్యాయి.

లక్ష్యం ఘనం.. ఆచరణలో విఫలం

రంగారెడ్డి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల ఆర్థిక చేయూత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేయించిన వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాలు (కస్టమ్ హైరింగ్ సెంటర్లు) నిరుపయోగంగా మారుతున్నాయి. అద్దెకు తీసుకువెళ్లేవారు లేకపోవడంతో యంత్ర పరికరాలు మూలన పడ్డాయి. వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరగడంతో గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, నాగళ్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, వరికోత మిషన్లు, పవర్ స్ప్రేయర్లు, బుష్ కట్టర్లు, డ్రమ్ సీడర్లు, డ్రోన్‌లు కస్టమ్ హైరింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచారు. ఖరీదైన యంత్రాలను కొనుగోలు

మిగతా 8వ పేజీలో...


కొందుర్గు మహిళా సమాఖ్య భవనం ముందు ట్రాక్టర్ పరిస్థితి ఇలా

అద్దె ట్రాక్టర్ అందుబాటులో లేదు



వానాకాలం సీజన్‌లో పంటలకు సిద్ధం అవుతున్న. దుక్కులు దున్నేందుకు అద్దె ట్రాక్టర్ అందుబాటులో లేదు. చేవెళ్ల మండల కేంద్రంలో షెడ్డులో ట్రాక్టర్ పంక్చర్ అయి ఉంది. దీంతో ప్రైవేట్ ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నిస్తున్నాను. చిన్న సన్నకారు రైతులకు అద్దె ట్రాక్టర్‌ను అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రాములు, రైతు, పామెన


మాట్లాడుతున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్

భూములిచ్చేది లేదు!

- తేల్చి చెప్పిన తిమ్మాపురం గ్రామ రైతులు
- అధైర్య పడొద్దు ఆదుకుంటాం..
- అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

కందుకూరు, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని మండలంలోని తిమ్మాపురం గ్రామ రైతులు తేల్చి చెప్పారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం తేల్చకుండా సర్వేలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిర్మించనున్న ఈ రోడ్డుతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని వివరించారు. రోడ్డుకు పూర్తిగా భూములు కోల్పోతున్న రైతుల కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఎకరాకు పరిహారంతో పాటు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం అదనంగా పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రైతులు కోరారు. తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి కృషి

- రూ.12,600 కోట్లతో 'ఇందిరగిరి సౌర జలవికాసం'
- పోడుభూముల్లో సాగుకు బోర్లు వేయించి పంపుసెట్ల అందజేత
- 18న మున్ననూర్‌లో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం
- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

6



కలిసుంటే కలదు సుఖం!

- ఆనందాలకు వేదిక ఉమ్మడి కుటుంబాలు
- రోజురోజుకూ విచ్ఛిన్నమవుతున్న ఫ్యామిలీలు
- కనుమరుగవుతున్న ప్రేమలు, అనుబంధాలు
- కాలానుగుణంగా చిన్నదైపోతున్న కుటుంబం

నేడు ప్రపంచ కుటుంబ దినోత్సవం

7

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం అంటే ఆనందాలకు వేదికగా ఉండేది. ఇంటి నిండా కుటుంబ సభ్యులతో సందడి కనిపించేది. కలిసుంటే కలదు సుఖం అని అప్పట్లో ఎన్నో కుటుంబాలు నిరూపించాయి. కానీ రానురాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు కలిసి ఉండేందుకు ఇష్టపడటం లేదు. అహం, స్వార్థం తదితర కారణాలతో వేరు కుటుంబాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇంటి పెద్దలు అనాథలుగా మిగిలిపోతున్నారు.. పిల్లలు ఆప్యాయతలకు దూరమవుతున్నారు.


డబ్బులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- ఎనిమిది మందిపై కేసు నమోదు

చేవెళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ఫామ్‌ల్యాండ్‌లో మంగళవారం రాత్రి పేకాట స్థావరాలపై రాజేంద్రనగర్ జోన్ సీఐ అంజయ్య, ఎస్సైలు రవికుమార్, రాజశేఖర్‌రెడ్డిల బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 8 సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకొని 8 మందిపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. కొద్దిరోజులుగా ఇక్కడ పేకాట ఆడుతున్నారని, పేకాటలో గెలిచిన వారికి ఆన్‌లైన్ ట్రాన్సక్షన్స్ చేస్తున్నారని పోలీసులు గుర్తించి దాడులు నిర్వహించారు. మొత్తం రూ.2.41 లక్షలు చేతులు మారినట్లు తెలిపారు.

అకాల వర్షం తీరని నష్టం

- తడిసి ముద్దయిన ధాన్యం


షాద్‌నగర్ మార్కెట్‌లో తడిసిన వరి ధాన్యం

రంగారెడ్డి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి వైర్లు తెగిపడి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. మార్కెట్లలో ఆరబోసిన ధాన్యం వాన నీటిలో కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. షాబాద్ మండలం చందనవెల్లిలో అత్యధికంగా 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 26.8 మిల్లీమీటర్లు, తలకొండపల్లిలో 10.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా నవాబుపేటలో 24.5 మిల్లీమీటర్లు, ధారూరులో 11.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.


పామెన గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన రెండు ఎద్దులు

షాద్‌నగర్ మార్కెట్‌లో వర్ష బీభత్సం

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షం బీభత్సం సృష్టించడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. బుధవారం సాయంత్రం కురిసిన అకాల

మిగతా 8వ పేజీలో...


దుబ్బచర్లలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కేంద్ర బృందం

అంగన్‌వాడీ సెంటర్ల పనితీరు అద్భుతం


- కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం కితాబు

మహేశ్వరం/ కందుకూరు మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం కితాబు ఇచ్చింది. బుధవారం మహేశ్వరం, కందుకూరు మండలంలోని దుబ్బచర్ల, సుభాన్‌పూర్, జైత్వారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను వారు సందర్శించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని బృందం సభ్యులు పరిత జైలం, కొండ రామకృష్ణ అన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇచ్చే ఆహారం, ఆటలు, బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ విధానాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతిశ్రీ, సూపర్‌వైజర్లు ఇందిర, సువర్ణ, విద్యావతి పాల్గొన్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం!

రోడ్డును విస్తరించారు.. విద్యుత్ లైన్లను వదిలేశారు!


రోడ్డులోనే కూరుకుపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



- రహదారిలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు
- పాత జాతీయ రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

షాద్‌నగర్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ వై జంక్షన్ వరకు ఉన్న పాత జాతీయ రహదారిని విస్తరించారు. కానీ విద్యుత్ లైన్లను యథావిధిగా వదిలేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఎత్తులను తొలగించి, లోతులను మట్టితో పూడుస్తూ రోడ్డును ఒకే లెవల్‌లో వేయడంతో అక్కడక్కడ రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మట్టిలో కూరుకుపోయాయి. కొన్ని విద్యుత్ స్థంభాలు రోడ్డులోనే ఉండిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా.. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపును మాత్రం ఎక్కడికక్కడే వదిలేశారు.

రూ.45 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ

షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ వై జంక్షన్ వరకు ఉన్న 3.9 కిలోమీటర్ల రోడ్డుతో పాటు కొత్తూర్‌లో మిగిలిన రెండు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను రూ.45 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్డు మధ్యలో ఆరు ఫీట్ల డివైడర్‌ను నిర్మించి, అందులో పూల మొక్కలు నాటి, విద్యుత్ దీపాలను సైతం ఏర్పాటు చేశారు. డివైడర్‌కు రెండు వైపులా బీటీ వేశారు. రోడ్డు మధ్య నుంచి 75 ఫీట్లలోపు

మిగతా 8వ పేజీలో...



లిఫ్టింగ్ చార్జి చెల్లిస్తే లైన్లు మారుస్తాం

షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ వై జంక్షన్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సిన అవసరం ఉంది. ఆర్అండ్‌బీ శాఖ ట్రాన్స్‌కోకు లిఫ్టింగ్ చార్జి కింద 10శాతం చెల్లిస్తే తాము సర్వీసు ఇస్తాం. పూర్తిగా 100 శాతం డబ్బు చెల్లిస్తే తామే పనులు పూర్తి చేస్తాం. లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

శ్యాంసుందర్‌రెడ్డి, డీఈ ట్రాన్స్‌కో, షాద్‌నగర్

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి

● రూ.12,600 కోట్లతో 'ఇందిరగిరి సౌర జలవికాసం'
● పోడుభూముల్లో బోర్లు వేయించి సోలార్ పంపుసెట్ల అందజేత
● 18న మున్ననూర్‌లో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం
● నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): గిరిజన, చెంచు రైతులకు పట్టాలిచ్చి పోడుభూములు సేద్యానికి యోగ్యంగా మలిచి.. వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరగిరి సౌర జల వికాసం పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. రూ.12,600 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ఈ పథకాన్ని ఈనెల 18న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని మున్ననూర్‌లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మల్లు రవి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కార్యాలయంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గిరిజనోద్ధరణకు పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరగిరి సౌర జలవికాస్ పథకం కింద చెంచు, గిరిజనులకు లోగడ ఇచ్చిన పట్టాభూముల్లో బోర్లు వేయించి సోలార్ పంపు సెట్లను అందించనున్నట్లు వివరించారు. ఈ పథకానికి నీటి పారుదల, విద్యుత్, రెడ్కో, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఐటీడీఏల ద్వారా నిధులను కేటాయించి వినియోగించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చెంచు గిరిజనులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ పథకానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రవి తెలిపారు. అలాగే చెంచులకు ప్రత్యేకంగా 10 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖాదర్‌ఖాద్రి, రాఘవేందర్, శ్రీనునాయక్, అంజినాయక్, కోట కృష్ణయ్య, బికుమాండ్ల రమేశ్, చంద్రయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

పేదలకు 'కల్యాణలక్ష్మి' వరం

శంషాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంలాంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆయన అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దత్తునాయక్, నాయకులు కె.మహేందర్‌రెడ్డి, నీరటి రాజు, శ్రీకాంత్‌గౌడ్, నర్కోడ శ్రీను, దౌనాకర్ గౌడ్, కృష్ణ, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆదిభట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఇంటర్నేషనల్ కంపెనీ వైట్‌గోల్డ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, చింతపట్ల ఎల్లేష్, పోచమోని కృష్ణ, వీరేశం, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న భూపాల్

రోగుల ప్రాణాలను పణంగా పెట్టొద్దు

● కాసులకు కక్కుర్తి పడి హైదరాబాద్‌కు తరలింపా?
● అత్యాశతో రోగుల ప్రాణాలకు ముప్పు
● 108 అంబులెన్స్ సిబ్బందితో సమీక్షలో ఎమ్మెల్యే శంకర్


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): రోగుల ప్రాణాలను పణంగా పెట్టొద్దని, ప్రైవేటు ఆస్పత్రులు రోగుల పాలిట రాబందుల్లా మారాయని, కాసులకు కక్కుర్తిపడి అత్యవసర సమయాల్లోనూ వారిని హైదరాబాద్‌కు తరలిస్తారా? అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 108 అంబులెన్స్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, హెల్త్ ఎడ్యుకేటర్ జర్కుల శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా 108 సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను తరలించడంపై మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి గానీ, అత్యవసర సమయాల్లో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులకు గానీ తరలించి ప్రాణాలు కాపాడాల్సి ఉంది. కానీ, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఇచ్చే డబ్బుల కోసం అపస్మారక స్థితిలో ఉన్న పేషెంట్లను సైతం అంతదూరం తరలించడం మంచి పద్ధతి కాదన్నారు. అంబులెన్స్ కోసం ఫోన్లు చేసేది కేవలం పేద ప్రజానికమని, ఒక్కో పేషెంట్‌పై అంబులెన్స్ సిబ్బందికి రూ.4వేలు చెల్లిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

వైద్యులే రెఫర్ చేస్తున్నారు

ప్రతీ చిన్న రోగానికి కూడా తమవద్ద మందులు లేవంటూ ప్రభుత్వ వైద్యులే పేషెంట్లను తరచూ ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని 108 సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. దాంతో రోగుల బంధువులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కోరుతున్నారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మిని ప్రశ్నించారు. అనారోగ్యులు, రోడ్డు ప్రమాదాల బారినపడ్డ వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బాల్‌రాజ్


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్, బాల్‌రాజ్

కడ్తాల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజావిశ్వాసం కోల్పోయిందని కల్వకుర్తి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్ లు ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించి అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లిలో బుధవారం వారు పర్యటించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌తో కలిసి పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్‌కోతలు కూడ మొదలయ్యాయన్నారు. వడగండ్ల వానకు పంటలు దెబ్బతిని నష్టపోయినవారిని ఆదుకోవాలని, ఎకరాకు రూ.30వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు బాలయ్య, యాదయ్య, మహేశ్, వీరేశ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఆమనగల్లు : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి కోరారు. కొనుగోలు కేంద్రం వద్ద ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం శోభారాణి సందర్శించారు. తూకాలను, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. ఇన్‌చార్జి ఏవో అరుణకుమారి, ఏఈవోలు శ్రీనాథ్, మీనాక్షి ఉన్నారు.

వీరభద్రేశ్వరుడి జాతర ప్రారంభం

తాండూరురూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లిలో వీరభద్రేశ్వరస్వామి ఆలయ జాతర బుధవారం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి కలశ పూజ నిర్వహించారు. ప్రధానార్చకుడు జగదీశ్వరస్వామి స్వామివారికి పూజలు, అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 5గంటలకు పల్లకిసేవ, అనంతరం అగ్నిగుండ ప్రవేశాలు, ఉమామహేశ్వరుల కల్యాణం, సాయంత్రం రథోత్సవ కార్యక్రమాలుంటాయని తెలిపారు.


కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

● శంషాబాద్ డీసీపీ రాజేశ్


పాపిలోన్ డివైస్‌ను పరీక్షిస్తున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు మరింత నమ్మకాన్ని, గౌరవాన్ని పెంపొందించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పెట్రోల్ మొబైల్ సిబ్బంది 100 డయల్ ఫిర్యాదులను స్వీకరించి త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని నేరాల నియంత్రణకు, సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కడ్తాల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీసీపీ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, పరిసరాలు, స్టేషన్ నిర్వహణను పరిశీలించారు. ఆవరణలో ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్‌తో సమావేశమయ్యారు. పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు సత్వరంగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా పాపిలోన్ డివైస్‌ను పరీక్షించారు.

క్రీడాకారులు రికార్డులు నెలకొల్పాలి


ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల క్రీడాకారులు

శామీర్‌పేట, మే14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో గెలిచిన నెట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో ఉత్తమ రికార్డులు నెలకొల్పాలని తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి శిరీషరాణి పిలుపునిచ్చారు. బుధవారం శామీర్‌పేట మినీ స్టేడియంలో జిల్లా స్థాయిలో నెట్‌బాల్ పోటీలను శిరీషరాణి ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ జిల్లాలకు చెందిన దాదాపు వంద మంది నెట్‌బాల్ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీల్లో గెల్చిన క్రీడాకారులను అసోషియేషన్ సభ్యులు రాష్ట్రస్థాయిలో నెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 48మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 8వ జాతీయ సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ క్రీడాపోటీలను ఈ నెల 15 నుంచి 18 వరకు జనగామలో నిర్వహిస్తామని శిరీషరాణి తెలిపారు. ఎంపికలను అసోషియేషన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు ప్రకాశ్, సంగీత, నెట్‌బాల్ సీనియర్ ప్లేయర్ ఓంప్రకాశ్, కోచ్‌లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రింగ్ రోడ్డు నిర్వాసితులకు పరిహారమివ్వాలి

తాండూరు, మే 14(ఆంధ్రజ్యోతి): బైపాస్ రింగ్ రోడ్డు కోసం ప్రభుత్వం భూములు, ప్లాట్లు తీసుకొని నిర్వాసితులకు పరిహారం ఇవ్వడం లేదని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్ రేటుకు మూడింతల పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. తాండూరులో బైపాస్ రింగ్ రోడ్డు కోసం కోకట్, అంతారం తదితర గ్రామాల్లో భూములు, ప్లాట్లు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండా భూములను లాక్కుంటోందన్నారు. నిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 19న ధర్నా చేస్తామని హెచ్చరించారు.



పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయం

బొంరాస్‌పేట్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రూ.90లక్షల కడా నిధులతో పాఠశాలల నిర్మాణాలకు నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, కృష్ణ, మల్లికార్జున్, నర్సిములునాయుడు, భీమయ్య పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న అంజనేయులు

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

కులకచర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదల వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపకరిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్‌లో సార సుగుణమ్మకు రూ.24వేల చెక్కును అందించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షర్ఫొద్దీన్, సోమలింగం, చంద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ మధుకర్

జాతర కోసం విరాళం అందజేత

మర్పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): వీర్లపల్లిలో పోచమ్మ, దుర్గమాత ఆలయాల్లో నవగ్రహాల ప్రతిష్ఠాపన, జాతర కోసం మాజీ జెడ్పీటీసీ మధుకర్ బుధవారం రూ.51వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని కాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

బొంరాస్‌పేట్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఏర్పుమళ్ల పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తోటి ఉపాధ్యాయులతో ఏర్పుమళ్ల, సీత్యానాయక్, గంజిపల్లి తండాల్లో ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఉచిత పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, మధ్యాహ్నం భోజనం వంటి సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పించాలని తెలపారు. కార్యక్రమంలో టీచర్లు కిషన్, సర్దార్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

పెద్దేముల్, మే 14 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందూర్‌కు చెందిన బాలమణికి పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బాలమణికి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ నర్సింహులు ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. ఈఎంటీకి పైలట్ జావెద్ సహకరించాడు. అనంతరం తల్లీశిశువులను ఆసుపత్రికి తరలించారు.



శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ నర్సింహులు

కలిసుంటే కలదు సుఖం!

రోజురోజుకూ విచ్ఛిన్నమవుతున్న ఫ్యామిలీలు

కనుమరుగవుతున్న అనుబంధాలు



ఆనందాలకు వేదిక ఉమ్మడి కుటుంబాలు

నేడు ప్రపంచ కుటుంబ దినోత్సవం

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కుటుంబంలో తాత, నానమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ, పిన్ని, బాబాయ్, అమ్మ, నాన్న అక్క చెల్లి, తమ్ముడు, వదిన, బావగారు, మరిది, మరదలు, అబ్బో ఎన్ని బాధ్యాలు.. ఎన్ని ఎల్లికలు... ఇంట్లో ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా తమదిగా భావించి ఆ చిక్కుముడిని విప్పేవారు. కుటుంబంలో తాత, ముత్తాత మొదలు వారి పిల్లలు, వారి పిల్లల పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాల ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంట్లో పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలు పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునేవారు. మారుతున్న కాలానుగుణంగా మారుతున్న జీవన శైలిలో కనీసం భార్య భర్తలు మాట్లాడుకోవడానికి సమయం ఉండటం లేదు. అమ్మా నాన్నలంటే మోయలేని బరువులుగా మారాయి. మనిషి అవసరాలకు అనుగుణంగా కుటుంబాలు కుచించుకుపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి.

సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలిపేందుకు కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండటం లేదు. ఈ పరిణామం వల్ల ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేక పోవడంతో మహిళలపై పనిభారం పెరిగి వారి ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కారణంగా సమాజంలో జరిగే దుష్పరిణామాలు గ్రహించి ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం 1993 మే 15ను అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ఈ రోజును వేడుకగా జరుపుకోవడం ప్రారంభించారు.

అహం, స్వార్థంతో వేరు కుటుంబాలు

సుఖ దుఃఖాలకు సంతోషాలకు వేదికగా నిలిచిన కుటుంబ వ్యవస్థ నేడు అహానికి, వ్యక్తి స్వార్థానికి కేంద్ర బిందువుగా మారింది. కలిస్తే పలకరింపులకు బదులుగా చీదరింపులు, పగలు ప్రతీకారాలకు వేదికలుగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తోన్నాయి. ఉమ్మడి కుటుంబం అంటే ఇష్టంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆర్థికపరమైన అంశాలకు ఉన్న విలువ, మానవ సంబంధాలకు ఇవ్వడం లేదు. కుటుంబాల మధ్య సంబంధాలన్నీ ఆర్థికపరమైన అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. ఇవి కుటుంబాల్లో అశాంతికి, కుటుంబాల విచ్ఛిన్నం కావడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం వయోవృద్ధుల సంక్షేమం పెద్ద సమస్యగా మారింది. వయోవృద్ధులు ఆనందంగా జీవించే పరిస్థితులు లేకుండా పోయాయి. జీవితాంతం కుటుంబ అభివృద్ధి కోసం కష్టపడి చివరి దశలో కుటుంబాలతో కలిసి సంతోషంగా ఉందామనుకున్న వృద్ధులకు ఆ అవకాశమే లభించడం లేదు. తల్లిదండ్రును చూసుకునే తీరిక లేక ఎంతోమంది వృద్ధాశ్రమాల్లో ఉంచుతున్నారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకుంటూ, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొంటున్నారు.

ఆదర్శంగా శశికళ కుటుంబం

జిల్లేడు చౌదరిగూడ మండలం, రావిర్యాల గ్రామానికి చెందిన దివంగతులు శర్వలింగంకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పరమేశ్వరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. పరమేశ్వరి 1985లో చనిపోయింది. తర్వాత శర్వలింగం శశికళను వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు జన్మించారు. శర్వలింగం మొదటి భార్య సంతానాన్ని శశికళ సాకింది. సొంత పిల్లలతో సమానంగా ఏ లోటు రాకుండా పెంచి పెద్ద చేసింది. పెద్ద కొడుకు శ్రీశైలం, రెండో కుమారుడు రవికుమార్, మూడో కుమారుడు సతీష్ వివాహాలు జరిపించింది. నాలుగో కుమారుడు మహేష్ పెళ్లి చేయాల్సి ఉంది. పెళ్లయిన కొడుకులకు ఒక్కొక్కరికీ ఇద్దరు పిల్లలున్నారు. నిరుపేద కుటుంబం. పెద్ద కుమారుడు కిరాణాషాపు, రెండోవాడు జీరాక్స్, మూడో కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం, నాల్గో కుమారుడు ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ బాధ్యతలన్నీ తల్లి శశికళనే చూసుకుంటుంది. అత్తమ్మ సారథ్యంలో కుటుంబ నిర్వహణ, బాధ్యతల్లో కోడళ్లు, కొడుకులు పాలుపంచుకుంటూ అందరూ కలిసిమెలసి, అన్యోన్యంగా సుఖ సంతోషాలతో జీవిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సంతోషంగా ఉన్నాం



అమ్మా.. అంటూ కొడుకులు, అమ్మమ్మ, నాయనమ్మ అంటూ పిల్లలు, అత్తమ్మ అంటూ ఆప్యాయంగా పలికరించే కోడళ్లు ఉన్నారు. చిన్నబ్బాయి పెళ్లి చేయాల్సి ఉంది. అందరూ పెళ్లిళ్లు చేశాను. మనవడు, మనవరాళ్లతో సంతోషంగా ఉన్నాను.

-శశికళ

కలిసి ఉంటే కష్టం దరిచేరదు



వికారాబాద్‌లో మ్యాడం కుటుంబం

కలిసి ఉంటే కష్టం దరిచేరదని చిన్నప్పుడు మా నాన్న చెప్పిన మాట మా అన్నదమ్ముళ్ల మనస్సులో అలాగే ఉండిపోయింది. మా నాన్న మ్యాడం క్రి.శే అంజయ్య, అమ్మ సరస్వతికి మేము తొమ్మిది మంది సంతానం. అందులో ఏడుగురం అన్నాదమ్ముళం మ్యాడం కృష్ణ, లక్ష్మీ నారాయణ శ్రీనివాస్, వేణుగోపాల్, వెంకటేశ్, రాము, గౌరీశంకర్, చెల్లెలు లక్ష్మీ, పద్మ ఉన్నాం. ఇద్దరు అన్నలు వృత్తి రీత్యా ఒకరు పరిగిలో, ఒకరు హైదరాబాద్‌లో ఉంటున్నా మేమంతా కలిసే ఉన్నాం. ప్రస్తుతం ఐదుగురు అన్నదమ్ముళం ఒకే ఇంటిలో ఉంటూ వ్యాపారాలు చేసుకుంటూ ఆనందంగా ఉన్నాం. మా పిల్లల పెళ్లిళ్లు కూడా చేశాం. వారు కూడా మాతోనే ఉంటారు. కుటుంబం అంతా ఒక్క దగ్గర ఉంటే ఒక ధైర్యం. ఒకరిగా ఉంటే ఎన్నో సమస్యలు వస్తాయి. ఉమ్మడిగా ఉంటే సొసైటీలో గౌరవం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఒకసారి పిల్లలు ఆలోచించాలి. డబ్బు కన్నా బంధాలకు విలువ ఇచ్చినప్పుడు ఆ డబ్బు కూడా మన వద్దకే వస్తుందని..

- మ్యాడం వెంకట్, ఐదో కుమారుడు, వికారాబాద్

కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ

17వరకు తుక్కుగూడ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ.. మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్



మహేశ్వరం, మే 14(ఆంధ్రజ్యోతి): త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పదవులు భర్తీ చేయనున్నామని, పదవులు ఆశించే వారు ఈనెల 17వరకు దరఖాస్తులను తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో అందజేయాలని మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తెలిపారు. ఈమేరకు బుధవారం తుక్కుగూడలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గాన్ని పార్టీ పరంగా నాలుగు బ్లాకులుగా విభజించామని.. జీహెచ్ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజనల్లను కలుపుకొని మొదటి బ్లాకు, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పోరేషన్లను కలుపుకొని రెండవ బ్లాకు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలను కలుపుకొని మూడవ బ్లాకు, మహేశ్వరం, కందుకూరు మండలాలను కలుపుకొని నాల్గవ బ్లాకుగా విభజించామన్నారు. ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి పని చేయాలనుకొని ముందుకెళ్లేవారు పార్టీ అధ్యక్ష బ్లాక్, డివిజన్, మండల, గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ఇతరత్రా పదవులను ఆశించే నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాన్ని నాలుగు బ్లాకులుగా విభజించిన విషయాన్ని గమనించి పదవుల పేర్లు నమోదు చేస్తూ సంధిత దరఖాస్తు ఫారాన్ని అందించాలని సూచించారు. ఈనెల 17వరకు పార్టీ కార్యాలయంలో అందజేయాలన్నారు. పార్టీ ఆదేశాలను కాదని పైరవీలతో ఎవరు ముందుకెళ్లినా ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి పదవులు తగిన సమయంలో తప్పకుండా వస్తాయని కేఎల్లార్ తెలిపారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

మహిళలు స్వశక్తితో ఎదగాలి

» చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

» ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

శంకర్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. మహిళా సాధికారికత కోసం ప్రతి ఒక్కరూ చేయూతనందించాలన్నారు. మెప్మా పీడీ మల్లేశ్వరి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, ఏఈ సాయికిరణ్, మెప్మా ఏడీఎంసీ ఉమేష్, టీఎంసీ వినోద్. మోకిల సొసైటీ సీఈవో వేణు, నాయకులు ప్రవీణ్ కుమార్, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం లబ్ధిదారుల ఎంపిక



శేఖాపురం అంజనేయులు

తాండూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం స్కీంలకు లబ్ధిదారుల ఎంపికను అధికారులు గ్రామసభలు పెట్టకుండానే పైరవీకారులు చెప్పినట్టే చేస్తున్నారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపురం అంజనేయులు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే కేటాయిస్తున్నారని అన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీంను పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలు నష్టపోతున్నారని, ఇలా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైనల్లో సాత్విక్‌రెడ్డి ద్వయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డి-రాధిక శర్మ జోడీ ఫైనల్లో ప్రవేశించి పతకం ఖాయం చేసుకున్నాయి. బుధవారం నగరంలోని గుత్తా జ్వాల బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన సెమీస్ పోరులో సాత్విక్ (తెలంగాణ)-రాధిక (పంజాబ్) 21-12, 21-9తో సూర్య-అమృత (కర్ణాటక)పై గెలిచి తుది పోరుకు అర్హత సాధించారు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సిద్ధార్థ్ (తెలంగాణ)-గౌస్ షేక్ (ఆంధ్రప్రదేశ్) జోడీ 21-16, 15-21, 19-21తో దీప్ రామ్-ప్రతీక్ (మహారాష్ట్ర) ద్వయం చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో వెన్నెల (తెలంగాణ)-నవ్య (ఆంధ్రప్రదేశ్) జంట 21-15, 17-21, 18-21తో దివ్య (కర్ణాటక)-బరుణి (హరియాణా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

లారీలు రావు.. వడ్లు పోవు

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల అవస్థలు



లారీలు రాకపోవడంతో కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు

చౌడాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లారీలు రాకపోవడంతో రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చౌడాపూర్ మండలంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. కేంద్రాలను ప్రారంభించి 18 రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారు. తరుచూ కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడుస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రాలకు లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



కార్మికులతో మాట్లాడుతున్న భూపాల్

ఆదిభట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఇంటర్నేషనల్ కంపెనీ వైట్ గోల్డ్ కార్మికులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నం చేస్తుందని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, ఇబ్రహీంపట్నం కన్వీనర్ చింతపట్ల ఎల్లేష్, సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, వీరేశం, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, అధికారి గణపతిరెడ్డి

పరిగిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

పరిగి, మే 14(ఆంధ్రజ్యోతి): పరిగిలో రూ.200ల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణ పరిధి విద్యారణ్యపురిలో స్కూల్ నిర్మాణానికి టీజీఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డితో కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని హంగులతో యూనివర్సిటీని తలపించేలా భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఇందుకు 20ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తోందని తెలిపారు. పేదవిద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యనందిస్తామన్నారు. విద్యారణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, మత్స్యశాఖ కార్యదర్శి అంజనేయులు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.చిన్ననర్సింహులు, శ్రీనివాస్, సర్వర్, అన్వర్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): పోచారం పరిధి వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామ వీధుల్లో రథోత్సవం కొనసాగింది. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్తయ్యయాదవ్, మెంబర్లు సభ్యులు అంజనేయులు, వెంకటేశ్, లావణ్య, సుధాకర్, ఈవో భాగ్యలక్ష్మి, పూజారి వినయ్‌శర్మ, నాయకులు వేణుగోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, రామారావు, జంగయ్య పాల్గొన్నారు.



బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



పోస్టర్ విడుదల చేస్తున్న దేవేందర్, కార్మికులు

సమ్మెను జయప్రదం చేద్దాం

షాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): మే 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని ఒలెక్ట్రా బస్సుల కంపెనీ ఎదుట కార్మికులతో కలిసి దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ చందన్‌వెళ్లి పారిశ్రామిక వాడలో వలస కార్మికుల శ్రమను పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని, కార్మిక శాఖ అధికారులు మొద్దునిద్రలో ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా 8 గంటల పనిదినం పోయి.. 12 గంటలకు పెరిగిందని, అతి తక్కువ వేతనంతో వలస కార్మికులతో చందన్‌వెళ్లి పారిశ్రామిక వాడ యాజమాన్యాలు వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని, అనేక ప్రమాదాలు జరిగినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మండ్లీ రాములు అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ గీత ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కేంద్రాన్ని రాములు సందర్శించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులతో కలిసి రైతులకు భోజనం వడ్డించారు. మార్కెట్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, నాయకులు పర్వతాలు, విజేందర్, కండె సాయి, మార్కెట్ సిబ్బంది తదితరులున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

మురుగునీటి కాలువను నిర్మించారు. రోడ్డు ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా విస్తరించారు. ఈ రోడ్డు కొన్ని నెలల క్రితమే పూర్తయినా నేటి వరకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లు గాని, ట్రాన్స్‌ఫార్మర్లను గాని పక్కకు తరలించలేదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు మట్టిలో కూరుకుపోగా, మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు ఎత్తుకు సమాంతరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు సైతం రోడ్డు మధ్యలో ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే మట్టిలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నీరు చేరి, షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం లేకపోలేదు. అలాగే వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా డ్రైవింగ్ చేసినా విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఢీకొట్టే అవకాశం ఉంది. లిఫ్టింగ్ చార్జి కింద ఆర్అండ్‌బీ శాఖ డబ్బులు చెల్లిస్తే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగిస్తామని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను తొలగించడానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించామని ఆర్అండ్‌బీ అధికారులు అంటున్నారు. ఈ వ్యవహారాన్ని ఎమ్మెల్యే శంకర్ పట్టించుకుని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ జంక్షన్ వరకు విస్తరించిన రోడ్డులోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడానికి కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ట్రాన్స్‌కోకు చెల్లించి, విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చిస్తాం. ఈ విషయం మా ఉన్నతాధికారుల దృష్టిలో కూడా ఉంది.

- ఎం.రాజశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ


రోడ్డుపైన ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం, పక్కన ట్రాన్స్‌ఫార్మర్

అకాల వర్షం.. తీరని నష్టం

(5వ పేజీ తరువాయి)

వర్షానికి మార్కెట్ ఆవరణలో ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం కొట్టుకుపోయింది. రైతులు తేరుకునే లోపే భారీ వర్షం కురిసి, వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. మార్కెట్ యార్డులోని షెడ్డు నిర్మాణం లోపం వల్ల వర్షపు నీరు చేరి ధాన్యం తడిసింది. కేంద్రంలో ఆశించిన స్థాయిలో కొనుగోలు లేకపోవడంతో రైతులు వ్యాపారులను ఆశిస్తున్నారు. వ్యాపారులు సైతం ధాన్యంలో తేమ ఉందని బుకాయించడంతో మరో మార్గం లేక ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి, కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు కంటతడి పెట్టారు. మద్దతు ధరపై ప్రభుత్వం సక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తే తాము నష్టపోయే వారం కాదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


షాద్‌నగర్ మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. గాలివాన కారణంగా కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మొయినాబాద్ రూరల్ : చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో ఉరుములు, పెరుపుల గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలుల వర్షం రావడంతో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. చేవెళ్లలోని మారుతి నగర్‌లో పిడుగు పడింది. పామెన గ్రామానికి చెందిన పట్నం సదానందం అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు పిడుగుపాటుకు మృతి చెందాయి.

క్రైం కార్నర్

ఔటర్‌పై ప్రమాదం.. వ్యక్తి మృతి



నుజ్జునుజ్జయిన డీసీఎం ముందు భాగం

శంషాబాద్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన కల్వ ఐలయ్య(40) మామిడిపల్లి రియల్స్ స్మార్ట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం మేడ్చల్ నుంచి డీసీఎం వ్యాన్‌లో కూరగాయల లోడ్‌తో శంషాబాద్ వైపు వస్తుండగా హుడా కాలనీ సమీపంలోకి రాగానే డ్రైవర్ రాజు నిద్ర మత్తులోకి జారుకోగానే రెయిలింగ్‌కు వాహనం ఢీకొంది. క్యాబిన్‌లో ఉన్న ఐలయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన వాహనాదారులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన భర్త మృతిచెందడంతో భార్య లలిత బోరున విలపించింది.

కారు ఢీకొనడంతో వృద్ధుడి దుర్మరణం

ఆదిబట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని సీతారాంపేట గేట్ వద్ద కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం సీతారాంపేటకు చెందిన మద్దెల ఎట్టయ్య(70) బుధవారం సీతారాంపేట గేటు వద్ద రోడ్డు దాటుతుండగా ఆరుట్ల గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం వైపుకు వెళుతున్న ఎర్టిగా కారు అతి వేగంతో వచ్చి ఢీకొడంతో ఎట్టయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు-బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

కేశంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన నక్కరమోని కృష్ణ, అతడి తోడల్లుడు చింతగూడ గ్రామానికి చెందిన వంగూరు రాజులు కలిసి బైక్‌పై కేశంపేట మండల కేంద్రం నుంచి నూర్ ప్యాలెస్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో బీఎస్‌వై గార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆల్టో కార్ బైక్‌ను ఢీకొట్టింది. వంగూరు రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత


మృతిచెందిన ఆవు

చౌదరిగూడ, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లచ్చంపేటలో చోటుచేసుకుంది. లచ్చంపేటలోని కమ్మరిపేట్ల మల్లేష్‌కు చెందిన పాడి ఆవును మేత కోసం వదిలాడు. దాంతో వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో షాక్ తగిలి ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, ఆవు విలువ దాదాపు రూ.70వేలపైగా ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు మల్లేష్ కోరాడు.

బంగారం, నగదు అపహరణ

కొత్తూర్, మే 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఓ ఇంటిలో చొరబడి బంగారంతో పాటు, నగదును అపహరించినట్లు ఎస్సై మురళీగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన అండాలు ఇంటికి తాళం వేసి సోదరుడి ఇంటికి వెళ్లిందని.. బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం విరగ్గొట్టి ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు బీరువాను పగుల కొట్టి అందులో ఉన్న 3తులాల బంగారం, రూ.10వేలు ఎత్తుకుని పారిపోయినట్లు పేర్కొన్నారు. అండాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళీగౌడ్ తెలిపారు.

షాద్‌నగర్‌కు 3,500 ఇళ్లు మంజూరు

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కేశంపేట : చెక్కులు పంపిణీ చేస్తున్న శంకర్

షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కేశంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షాద్‌నగర్ నియోజకవర్గానికి పైలట్ ప్రాజెక్టుగా 3,500 ఇళ్లను మంజూరు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నిధుల కొరత లేదని, మంజూరైన లబ్ధిదారులు పునాదులు వరకు నిర్మించుకుంటే.. ఖర్చును ప్రభుత్వం వెంటనే వారి ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గ్రామానికి 10 నుంచి 35 ఇండ్లు మంజూరైనట్లు వివరించారు. ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే రాజీవ్ యువ వికాసం కింద నియోజకవర్గానికి 4నుంచి 5వేల మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం 190 మందికి రూ.కోటీ 90లక్షల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ పార్థసారథి, డీటీ ఆనంద్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బస్వం, తిరుపతిరెడ్డి, రఘునాయక్, బాల్‌రాజ్ గౌడ్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, పెద్ద ఎల్కిచర్ల, వనంపల్లికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, పాపయ్య, నర్సింహులు, లింగంగౌడ్‌లున్నారు. అలాగే కేశంపేట మండలం కొండారెడ్డిపల్లికి చెందిన వట్టెల రవికి రూ.44వేలు, పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన నర్సింలుకు రూ.44వేలు, మల్లేష్‌కు రూ.22వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, కొండారెడ్డిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం బింజుసారియా ఇస్పత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ భారీ విరాళాన్ని ఇచ్చింది. ఎమ్మెల్యే శంకర్‌కు కంపెనీ యజమాని వినోద్‌కుమార్ కేడియా తన తండ్రి భన్వర్‌లాల్ జ్ఞాపకార్థం రూ.11లక్షల చెక్కు అందించారు. దాంతో ఎమ్మెల్యే ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ న్యాయవాది మోముల బసప్ప, హితేష్ కేడియా ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


చేవెళ్ల : ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న గ్రామస్థులు

శంకర్‌పల్లి/చేవెళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ క్రిష్టల్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లు వంటిదని అన్నారు. భగవంతున్ని నిత్యం పూజించి ఆయన కృపకు పాత్రులు కావాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, నాయకులు ప్రవీణ్‌కుమార్, పాండు రంగారెడ్డి, రఘునందన్‌రెడ్డి, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమ్మెట క్రాస్‌రోడ్‌లో ఆదిగురువు శ్రీ దక్షిణామూర్తి నూతన మందిరం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మాన్ని కాపాడుకోవాలి

షాద్‌నగర్ రూరల్ : ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో బుధవారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడుకుంటేనే మనుగడ ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు.

'ఆర్ట్ ఆఫ్ గివింగ్' సహకారంతో టీ స్టాల్ ఏర్పాటు



టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న శివకుమార్

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ దేశ వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆమనగల్లు పట్టణంలో నిరుపేద వృద్ధ దంపతుల జీవనాధారం కోసం టీ స్టాల్‌ను ఏర్పాటు చేసింది. నైబర్ గుడ్ అనే నినాదంతో ప్రొఫెసర్ అచ్యుత్ సమంత పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆమనగల్లుకు చెందిన వృద్ధ దంపతులు గుర్రం కృష్ణయ్య-పెద్దమ్మకు తోడ్పాటునందించారు. సంస్థ తరఫున మండల పరిషత్ కార్యాలయం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో టీ స్టాల్‌ను ఏర్పాటు చేసి అందజేశారు. బుధవారం ఆర్ట్ ఆఫ్ గివింగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శివకుమార్ స్టాల్‌ను ప్రారంభించారు. సేవా బృందం సభ్యులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులకు చిరస్థాయి కీర్తి

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడా కీర్తించబడుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతీఒక్కరు జీవిత కాలంలో ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు చింతల రమణారెడ్డి సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. భృంగి ఆనంద్, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నర్సిరెడ్డి, సంజీవ్‌యాదవ్, భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నర్సింహ, పర్వత్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల నిర్మాణాలు పూర్తి చేస్తాం


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్యా దేవేందర్‌యాదవ్

కొత్తూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీలో మిగిలిపోయిన భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తామని చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ 3వ వార్డులో రూ.5లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మిస్తున్న భూగర్భ మురుగు కాల్వ పనులను బుధవారం ప్రారంభించారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను అంచలంచెలుగా పూర్తి చేస్తామని తెలిపారు. కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, నర్సింహగౌడ్, సోమ్లానాయక్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, యాదయ్య, జె.శ్రీను, పెద్దపురం కృష్ణయ్య, నాగరాజు, బాస్కర్ పాల్గొన్నారు.

17న వేణుగోపాలస్వామి ఆలయ భూముల వేలం

కేశంపేట మే 14(ఆంధ్రజ్యోతి): వేములనర్వ శివారులోని వేణుగోపాలస్వామి ఆలయ భూములను ఈనెల 17 వేలం వేస్తున్నట్లు ఈవో రాము ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేనెంబర్ 27, 28, 29, 41లో 20.39 ఎకరాలకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు వేలం నిర్వహిస్తున్నామని, రూ.3,000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన వివరించారు.

కొండారెడ్డిపల్లిలో..

కేశంపేట మండల పరిధిలోని పోమాలపల్లి, కొండారెడ్డిపల్లి వారు గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను వేలం వేస్తున్నట్లు ఈవో రాము తెలిపారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ. 3000 చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలియజేశారు.

క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి


అవగాహన కల్పిస్తున్న గౌరవ్‌శర్మ

మంచాల, మే 14(ఆంధ్రజ్యోతి): క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని తమను తాము రక్షించుకోవాలని వ్యాయామ నిపుణుడు గౌరవ్‌శర్మ సూచించారు. బుధవారం గురునానక్ విద్యాసంస్థల స్ట్రీట్ కాజ్ బృందం ఆధ్వర్యంలో మండల పరిధిలోని జాపాల జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా శిబిరం నిర్వహించారు. బాహ్య ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన, వేగవంతమైన ప్రతిస్పందనలు, ఆత్మ విశ్వాసం పెంపొందడంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ యువత భద్రత కోసం తాము మరిన్ని శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

అద్దె యంత్రం.. నిరుపయోగం!

(5వ పేజీ తరువాయి)

చేయలేని చిన్న, సన్నకారు రైతులు ఈ కేంద్రాల్లో అద్దెకు తీసుకువెళ్లేందుకు అవకాశాన్ని కల్పించారు. బయట మార్కెట్ కంటే తక్కువ అద్దెను నిర్ణయించారు. పథకం ప్రారంభంలో మంచి స్పందన లభించినప్పటికీ.. ఆ తర్వాత రైతుల నుంచి అంతగా స్పందన లేకపోవడంతో ఆయా యంత్రాలు నిరుపయోగంగా మారాయి. యంత్రాల వినియోగంపై మహిళా సంఘాల కుటుంబంలోని యువకులకు శిక్షణ ఇప్పించినా వాటిని వాడక పోవడం, నిర్వహణ కొరవడి కొద్ది రోజులకే మూలన పడ్డాయి. ఈ పథకంతో లాభాల కంటే అప్పులే మిగిలినట్లు సమాచారం.

జిల్లాలో 2020 సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్టు కింద కందుకూరు మండలాన్ని ఎంపిక చేసుకున్నారు. అక్కడ విజయవంతం కావడంతో చేవెళ్ల, కొందుర్గు, కేశంపేట, మంచాల, తలకొండపల్లి మండలాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో యంత్రాల కొనుగోలుకు బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా రూ.22 లక్షల వరకు మహిళా సంఘాలకు రుణాలను అందజేశారు. అందులో మండల సమాఖ్య కంట్రిబ్యూషన్ పది శాతం, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ నుంచి 25 శాతం, స్త్రీనిధి నుంచి 65 శాతం రుణం అందించారు. యంత్రాలు, పరికరాలను ఉపయోగించే విషయమై మహిళా సంఘాల సభ్యుల కుటుంబాల్లోని యువకులకు శిక్షణ ఇచ్చారు. మొదట్లో యంత్రాలను వాడుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు సరైన నైపుణ్యం లేక, పనుల్లో నాణ్యత లేకపోవడంతో వాటిని అద్దెకు తీసుకునేవారు కరువయ్యారు. ట్రాక్టర్లు, పరికరాలను అద్దెకు తీసుకున్న వెంటనే అద్దె చెల్లించాలి. కానీ.. అద్దె చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో డీజిల్ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఆయా పరికరాలు మూలన పడ్డాయి. అంతేకాక ఇప్పటికే గ్రామాల్లో చాలా మంది సొంతంగా ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. వారికే వ్యవసాయ పనులు దొరకక ఇతర పనులకు వెళ్తున్నారు. దీంతో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ట్రాక్టర్లకు గిరాకీ రావడం లేదు. ట్రాలీలు కలిగిన ట్రాక్టర్లకు కిరాయిలు దొరుకుతున్నా పెద్దగా లేవని సమాచారం. చిన్నపరికరాలు అద్దెకు తీసుకెళుతున్నారు.

పనిముట్లు, చార్జీల వివరాలు

పనిముట్లు	రైతు సేవా కేంద్రం ద్వారా గంటకు (రూ.)	ప్రైవేట్ ద్వారా గంటకు (రూ.)
ట్రాక్టర్ దున్నేందుకు	1,000	1,200
కల్టివేటర్ (కడిగడి కోసం)	1,200	1,400
పవర్ టిల్లర్	600	800
విత్తనాలు విత్తేందుకు	1,000	1,200
టార్పాలిన్ (రోజుకు)	50	100

మరమ్మతులు కరువు

కస్టమ్ హైరింగ్ సెంటర్లలో ప్రస్తుతం ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని సెంటర్లలో యంత్ర పనిముట్లు షెడ్డులకే పరిమితమయ్యాయి. చేవెళ్ల, కొందుర్గు, మంచాల మండలంలో ట్రాక్టర్ టైర్లు పంక్చరై ఉన్నాయి. మరమ్మతులకు నోచుకోవడం లేదు. లక్షలు వెచ్చించి చిన్న, సన్నకారు రైతులకు చేదోడు వాదోడుగా నిలిచే వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాల్లో యంత్ర పనిముట్లకు మరమ్మతులు చేపట్టి పేద రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కేశంపేట ట్రాక్టర్ ఎక్కడ?

అన్ని కేంద్రాల్లో ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు నిరుపయోగంగా దర్శమిస్తున్నప్పటికీ.. కేశంపేటలోని కస్టమ్ హైరింగ్ సెంటర్లలో ట్రాక్టర్ కనిపించడం లేదు. అద్దె కేంద్రంలో రోటోవేటర్, కల్టివేటర్ ఉన్నాయి. కానీ.. సీహెచ్‌సీలో ఉండే ట్రాక్టర్‌ను తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన మహిళా సంఘం అధ్యక్షురాలు తీసుకువెళ్లిందని ఏపీఎం భగవంతు తెలిపాడు. మహిళా అధ్యక్షురాలిని ట్రాక్టర్ విషయం ప్రస్తావించగా సరైన సమాధానం ఇవ్వడం లేదు. వారం రోజుల నుంచి ట్రాక్టర్ కనిపించడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇంతకు ట్రాక్టర్ ఉందా..? ఎవరికైనా అమ్ముకున్నారా అనే విషయం తెలియాల్సి ఉంది.

కొలతలతో సంబంధం లేకుండా కూలి చెల్లించాలి

మాడ్గుల, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరమించుకోవాలని, కొలతలతో సంబంధం లేకుండా కూలి డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్డీ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్త బ్రాహ్మణపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 3 నెలల పెండింగ్ బిల్లులు రావాలని కూలీలు తెలిపారు. డబ్బులు సకాలంలో చెల్లించక పోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని పాషా తెలిపారు.

శ్మశానవాటికను కాపాడాలి

మాడ్గుల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్విన్ గ్రామంలో గల ఎస్సీ(మాదిగ)లకు చెందిన శ్మశానవాటికను కబ్జా కాకుండా కాపాడాలని బుధవారం పలువురు బుధవారం తహసీల్దార్ వినయసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇర్విన్ గ్రామంలోని సర్వేనెంబర్ 816, 825లో 3ఎకరాల 25గుంటల భూమిని ఎస్సీలు శ్మశానవాటికకు వాడుకునేవారని, ఆ భూమిని కబ్జా చేయడానికి ఓ రియల్ఎస్టేట్ వ్యాపారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడని వాపోయారు. ఈమేరకు కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఇర్విన్ గ్రామానికి చెందిన బద్ది రాజు, ఒగ్గు మల్లేష్, బామండ్లపల్లి సాలయ్య, బామండ్లపల్లి అశోక్‌లు తహసీల్దార్ వినయసాగర్‌ను కోరారు.

యాచారం ఆసుపత్రికి మరమ్మతులు

● పనులకు శ్రీకారం చుట్టిన కాంట్రాక్టర్

యాచారం, మే 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో పలు మార్లు వరుస కథనాలు రావడంతో ఆనాటి జిల్లా కలెక్టర్ శశాంక ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి దుస్థితిపై ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఆసుపత్రి స్లాబ్‌కు మరమ్మతులతో పాటు కిటికీలు, తలుపులు బిగించడం, ఫ్లోరింగ్ వేయడం తదితర పనులకు రూ.50లక్షల నిధులను విడుదల చేశారు. ఆసుపత్రిని ఆధునాతనంగా మార్చాలని, రోగులకు, వైద్యులకు ఇబ్బందులు రాకుండా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. అయితే, కొంతకాలంగా అధికారులు మరమ్మతులపై చొరవ తీసుకోలేదు. ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డి ఆసుపత్రి తీరుపై ఆరా తీశారు. తక్షణమే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. బుధవారం ఆసుపత్రిని ఆధునీకరించే పనులకు కాంట్రాక్టర్ శ్రీకారం చుట్టారు. దాంతో రోగులు, వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.